సాక్షి
విశాఖపట్నం
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఒత్తిడికి గురికావొద్దు
8లో

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అప్పారావు కోరారు.



మిలాన్‌కు ముస్తాబు

జీచ్‌రోడ్డు: ఈ నెల 19 నుంచి జరగనున్న మిలాన్-24కు సాగరతీరం ముస్తాబైంది. విన్యాసాలను తిలకించేలా ఏర్పాట్లు చేశారు.



అయోధ్యకు 'ఆస్థా' పయనం

అయోధ్య బాల రాముని దర్శనం కోసం 'ఆస్థా'ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖ నుంచి రామభక్తులతో బయల్దేరింది.
8లో

న్యూస్‌రీల్

మిలాన్-2024 పై సీపీ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ రవిశంకర్

అల్లిపురం: ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న మిలాన్-2024పై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో మిలాన్-2024 సందర్భంగా నగరానికి ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీఐపీలు, వీవీఐపీలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతపై చర్చించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మిలాన్-2024ను విజయవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ -1 వీఎస్ మణికంఠ చందోల్, డీసీపీ క్రైం పి.వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈకోర్స్,కావలీర్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీలో ఈకోర్స్, కావలీర్స్,గెలాక్సీ జట్లు శుభారంభం చేశాయి. రైల్వే స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. ప్రతిగా ఈకోర్స్ మరో బంతి మిగిలి ఉండగానే తొమ్మిది వికెట్లకు 122 పరుగులతో విజయాన్నందుకుంది. శేషు ఐదు వికెట్లు తీశాడు. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కావలీర్స్ ఐదు వికెట్లు కోల్పోయి 262పరుగులు చేసింది. రోహిత్ 139 పరుగులు చేశాడు. ప్రతిగా సైమండ్ బ్లూస్ తొమ్మిది వికెట్లు కోల్పోయి 136 పరుగులే చేసింది. మరో మ్యాచ్‌లో గాజువాక గ్రీన్స్ 89 పరుగులకు ఆలౌట్ కాగా గెలాక్సీ జట్టు 9.5 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. రైల్వే స్టేడియంలో జరిగిన పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి, ఈకోర్స్ జాయింట్ స్పోర్ట్స్ అధికారి బి.అవినాష్, రంజీ ఆల్‌రౌండర్ శశికాంత్, యూసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. అరబిందో స్పైసెస్, జాబ్ డీలర్స్, రాయల్ ఎన్ ఫీల్డ్, సాయి కెమికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హరీష్ ఫుడ్ బేవరేజెస్, హెటిరో డ్రగ్స్ శ్రీరామ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 555 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. సర్వీస్ అడ్వైజర్ టెక్నీషియన్, జూనియర్ కెమిస్ట్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ క్లర్కు, బ్రాంచ్ ఇంచార్జ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన 18-42 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ10 వేలు నుంచి రూ.18,500ల వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

సింహగిరిపై రేపు రథసప్తమి వేడుకలు

సింహచలం: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మంగళశాసనం తరువాత ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రధాన దేవాలయ ప్రకారంలోని రాతి రథం మీదకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం నిత్యం కల్యాణం 10 గంటలకు జరుగుతుందన్నారు. 12.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. కృష్ణాపురం గోశాలలో నిర్మించిన సూర్యభగవానుడి విగ్రహం వద్ద రథసప్తమి వేడుకలు ఉదయం 8 నుంచి ప్రారంభమవుతాయని ఈవో పేర్కొన్నారు.

బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు

పెందుర్తి: ఎన్నికల విధులకు గైర్హాజరైన పలువురు బీఎల్‌వోలకు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌వో శేష శైలజ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని 89, 90, 94, 95, 98, 100, 106, 107 పోలింగ్ స్టేషన్లను ఈఆర్‌వో సందర్శించారు. ఆ సమయంలో ఆయా పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోలు విధుల్లో లేరు. దీంతో సదరు బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

వసతికి వెలుగులు..!

- ఎస్సీ హాస్టళ్ల భవనాలకు కొత్త హంగులు
- 10 హాస్టళ్ల ఆధునికీకరణకు రూ.2.85 కోట్ల మంజూరు
- దశల వారీగా అన్ని వసతి గృహాల అభివృద్ధి
- రూ.24 కోట్లతో 6 చోట్ల నూతన భవనాలకు ప్రతిపాదనలు
- కలెక్టర్ చొరవతో సమకూరుతున్న మౌలిక సౌకర్యాలు



సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన గాజువాక హాస్టల్



చినగదిలి హాస్టల్‌కు మరమ్మతులు

విశాఖ విద్య: వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఒక్కో అడుగు ముందుకుపడుతోంది. ఈ నేపథ్యంలోనే సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఆధునికీకరణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. సీఎస్ఆర్ నిధులతో జిల్లాలోని గాజువాక, మధురవాడ హాస్టళ్లను అభివృద్ధి చేయగా, తాజాగా ఎంపీ ల్యాండ్స్ నిధులతో మరో 10 హాస్టళ్లల్లో రూ.2.85 కోట్లతో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిధులు కొరత లేకుండా, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే రూ.1.42 కోట్లను మంజూరు చేశారు. తాగునీరు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లకల్పనతో పాటు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనాల్లో అవసరమైన మరమ్మతులు, వైట్ వాష్ వంటి పనులు చేపడుతున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేలా పనులపై శ్రద్ధ తీసుకుంటున్నారు.

హాస్టళ్లకు పక్కా భవనాలు

సాంఘిక సంక్షేమ హాస్టళ్లను బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. జిల్లాలో 23 వసతి గృహాలు ఉండగా, వీటిలో 3వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకునే 1,960 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒకప్పుడు ఎస్సీ హాస్టళ్లు విద్యార్థులతో కళకళలాడేవి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ హాస్టళ్లను నిర్వీర్యం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో మళ్లీ విద్యార్థులు బడిబాట పడుతున్నందున, హాస్టళ్లకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వీటిని ఆధునికీకరించాలని ప్రభుత్వం స్పష్టం చేయటంతో, జిల్లా యంత్రాంగం ఇందుకనుగుణంగా పక్కా కార్యాచరణతో ముందుకెళుతోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కృష్ణానగర్, సీతమ్మధారలో ఒక్కో చోట రూ.6కోట్లతో అధునాతన భవనాలు నిర్మించేలా ప్రతిపాదనలు చేశారు. అలాగే భీమునిపట్నం, ఆనందపురం, పెదగంట్యాడ, పెందుర్తిలో ఒక్కో చోట రూ.3 కోట్లతో భవనాలు నిర్మించాలని ప్రతిపాదించారు.

హాస్టళ్ల వారీగా మంజూరైన నిధులు

బాలుర హాస్టల్-1, ఎంవీపీ కాలనీ	:	రూ.38 లక్షలు
బాలుర హాస్టల్ -2, సీతమ్మధార	:	రూ.15.50 లక్షలు
బాలికల హాస్టల్, పెందుర్తి	:	రూ.28.60 లక్షలు
బాలికల హాస్టల్, గాజువాక	:	రూ.22 లక్షలు
కాలేజీ బాలుర హాస్టల్ -4 ,సీతమ్మధార	:	37.60 లక్షలు
కాలేజీ బాలుర హాస్టల్, నరవ	:	రూ.27.10 లక్షలు
కాలేజీ బాలికల హాస్టల్, గాజువాక	:	రూ.6.40 లక్షలు
బాలుర హాస్టల్ , భీమునిపట్నం	:	రూ.33 లక్షలు
కాలేజీ బాలుర హాస్టల్ , తగరపు వలస	:	రూ.37.80 లక్షలు
కాలేజీ బాలుర హాస్టల్ , చినగదిలి	:	రూ.39 లక్షలు

కలెక్టర్ చొరవతో..



కలెక్టర్ మల్లికార్జున ప్రత్యేక చొరవ తీసుకున్నందునే సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ పట్టింది. విద్యారంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. మళ్లీ హాస్టళ్లకు వచ్చే విద్యార్థులు సంఖ్య తప్పకుండా పెరుగుతుందనే నమ్మకం ఉంది. అందుకే వీటిలో మౌలిక సౌకర్యాలను పెంపొందించేలా పనులు చేపడుతున్నాం.

-కే. రామారావు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ

మళ్లీ మంచి రోజులు వచ్చాయి



30 ఏళ్లుగా సర్వీసులో ఉన్నా. వసతి గృహాలు గురించి ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఎంతో బాధ కలిగేది. కానీ మా హాస్టళ్లకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. మౌలిక సౌకర్యాలు కల్పించేలా ప్రాధాన్యత క్రమంలో హాస్టళ్లను అభివృద్ధి చేయడం చాలా సంతోషంగా ఉంది. మా సొంతింట్లో పనులు మాదిరే పర్యవేక్షణ చేసుకుంటున్నాం.

-ఆర్.ప్రసాదరావు, హెచ్‌డబ్ల్యూవో, సీతమ్మధార



• అక్షరానికి శ్రీకారం



వేద వినుత.. విద్యాప్రదాత సరస్వతీ దేవి. విద్యాప్రదాయిని, కళలకు అధిదేవత అయిన వాగ్దేవి జన్మదినమైన శ్రీ పంచమి పర్వదినాన తమ చిన్నారులతో తొలి అక్షరాలను దిద్దించారు తల్లిదండ్రులు. చదువులమ్మ సన్నిధిలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలతో పాటు సరస్వతీ పూజలు వైభవంగా జరిగాయి. స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి ఆలయం, నగరంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ప్రాంగణాలన్నీ కళకళలాడాయి.

ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- జెడ్పీ సమావేశంలో పలు అంశాలపై చర్చ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: జిల్లాలోని ప్రజల సంక్షేమానికి, ఆరోగ్యానికి పెద్దపీట వేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సత్వరం సేవలందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు, ఆస్పత్రులకు వచ్చే సామాన్య ప్రజలను గౌరవిస్తూ వారికి సేవలందించాలన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాల తాజా పరిస్థితి ఏంటన్న వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని అధికారులకు సూచించారు. జలజీవన్ మిషన్లో భాగంగా చేపట్టిన పనులు సజావుగా నిర్వహించాలన్నారు. ఆయా పనులకు సంబంధించిన ప్రగతి వివరాలను గ్రామ పరిధిలోని నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. సోలార్ విద్యుత్ మోటార్లు, గృహ నిర్మాణాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైట్ ఎడ్యుకేషన్ ప్రకారం 25 శాతం సీట్లు పేదల పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాలకు సెస్ చార్జీలు త్వరితగతిన చెల్లించాలని ఆయా శాఖల అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సేవలను గుర్తించి రాజ్యసభకు నామినేట్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యావాదాలు తెలుపుతూ సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సీఈవో ఎం. పోలినాయుడు, అనకాపల్లి జిల్లా డీఆర్వో దయానిధి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

12 ప్రాంతాల్లో 4,818 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు బుధవారం అర్బన్ పరిధిలో 12 ప్రాంతాల్లో నిర్వహించారు. ఆదర్శనగర్, పురుషోత్తపురం, చంద్రనగర్, న్యూగాజువాక, గిరిజా కాలనీ, బాపూజీనగర్, అంబేద్కర్‌నగర్, ఎఎస్ఆర్‌నగర్, కొబ్బరితోట, లాసన్స్‌బే కాలనీ, బక్కన్నపాలెం, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 4,818 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వివరించారు.

నేడు 10 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

గురువారం నగర పరిధిలో 10 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. సాగర్‌నగర్, ఎంఎస్ఆర్ లేఅవుట్, ఎన్‌జీజీవో కాలనీ, భీమనగర్‌లో రెండు చోట్ల, రైల్వే న్యూకాలనీ, అంబేద్కర్ కాలనీ, పెదగంట్యాడ, సిద్దేశ్వరం, చంద్రానగర్ తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

శారద..స్వరూప సుధ

- రెండు దశాబ్దాలకు పైగా విరాజిల్లుతున్న విశాఖ శ్రీశారదాపీఠం
- ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజంలో సేవలకు పెద్దపీట
- హిందూధర్మం కోసం విశేషంగా పాటుపడుతున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- నేటి నుంచి పీఠంలో ఐదురోజులు వార్షికోత్సవాలు



వార్షికోత్సవాలకు ముస్తాబయిన చినముషిడివాడలోని శారదాపీఠం



రాజశ్యామల అమ్మవారు

పెందుర్తి: 'శ్రీశారద దయాశారద' అనేది ఆర్యోక్తి. శారదామాత కరుణకటాక్షాలతోనే ఈ జగతి వర్ధిల్లుతోందన్నది పెద్దల మాట. అంతటి పెద్దమ్మ అభిమాన దయాప్రాంగణం విశాఖ శ్రీశారదాపీఠం. విశాఖ వాకిట రెండు దశాబ్దాల క్రితం పునాది రాయి వేసుకున్న శారదాపీఠం దేశంలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. శారదాపీఠంలోని అడుగుపెట్టగానే అమ్మ ఒడికి చేరినంత మానసిక ప్రశాంతత కలుగుతుంది. పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ నేతృత్వంలో పీఠంలో ఆధ్యాత్మికతతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. శారదాపీఠం వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమై ఐదు రోజుల పాటు దిగ్విజయంగా కొనసాగనున్నాయి. గతంలో కంటే భిన్నంగా ఈసారి పీఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

ప్రముఖుల తాకిడి

హంపీ విరూపాక్ష పీఠాధిపతి పీఠానికి గతంలో విచ్చేశారు. నాటి ప్రధాని పి.వి నరసింహరావు, ప్రఖ్యాత సినీ నటుడు రజనీకాంత్, మోహన్ బాబు, కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి పీఠాన్ని వివిధ సందర్భాల్లో దర్శించుకున్నారు. 2015లో పీఠంలోని నిర్వహించిన వార్షికోత్సవాల్లో ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు జరిపారు. 2016లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి పీఠాన్ని సందర్శించి వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన కుంభాభిషేకంలో పాల్గొన్నారు. తరువాత 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి, తరువాత పలుమార్లు వైఎస్ జగన్ పీఠాన్ని సందర్శించారు. 2018 డిసెంబర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సతీసమేతంగా వచ్చి రాజశ్యామల పూజలతో పాటు స్వామీజీ ఆశీర్వచనం తీసుకున్నారు.



గిరిజన ప్రాంతాంలో వస్త్రదానం చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి (ఫైల్)

ఆధ్యాత్మిక వెలుగు

1997లో పెందుర్తి మండలం చినముషిడివాడ కేంద్రంగా విశాఖ శారదాపీఠానికి అంకురార్పణ జరిగింది. ఆగస్టు 4న పీఠంలో ఆదిశంకరుని విగ్రహానికి ప్రతిష్టాపన చేశారు. అదే ఏడాదిలో ఇక్కడ స్వామీజీ చాతుర్మాస దీక్ష ప్రారంభించారు. తరువాత ఏడాదే శారదామాత దేవాలయానికి శంకుస్థాపన చేసి శారదాపీఠంగా తీర్చిదిద్దారు. పీఠంలోని శారదా స్వరూప రాజశ్యామలమాత, ఆదిశంకరాచార్యులు, దాసాంజనేయస్వామి (18 అడుగుల ఏకశిల), వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి, మేధాదక్షిణామూర్తి, గణపతి, శ్రీకృష్ణ, దత్తాత్రేయ, కాళభైరవ, నాగదేవతమూర్తులు కొలువయ్యారు. పీఠంలోని జమ్మి వృక్షానికి ఎంతో ప్రత్యేకత ఉంది.

సేవల్లో ముందడుగు..

విశాఖ శారదాపీఠంలో సామాజిక సేవలో నిరంతరం ముందడుగు వేస్తోంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో వందలాది మంది వేద, స్మార్థ విద్యార్థులకు ఉచితంగా విద్య నేర్పించి సమాజానికి అందిస్తోంది. గురువులకు తగిన ప్రోత్సాహకాలు ఇస్తోంది. గిరిజన ప్రాంత రైతులకు పాడిపంటలకు ఉపయోగపడాలన్న తలంపుతో ఉచితంగా గోవులు, ఎద్దులను వితరణ గావిస్తోంది. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాను వల్ల నష్టపోయిన వేలాది మందికి ఉచితంగా బియ్యం, వస్త్రాలు, ఇతర నిత్యవసరాలు అందజేసింది. 2012లో పీఠం ఆధ్వర్యంలో 500 మంది గిరిజనులను తిరుమల పంపించి వెంకన్న దర్శనం చేయించారు. 2020 మార్చిలో కరోనా కారణంగా ఏర్పడిన లాక్‌డౌన్‌లో పీఠం చేసిన సేవలు అనిర్వచనీయం. ఎల్జీ పాలిమర్స్ విస్ఫోటనం సమయంలో కూడా పీఠం తరపున స్థానిక ప్రజలకు భోజన వసతి కల్పించారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పీఠం భక్తులు అనేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. స్వామీజీ ప్రతీ జన్మదినోత్సవం నాడు వేలాది మంది ప్రజలకు వస్త్రదానం చేస్తారు. పీఠంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే వేదపండితులను ఘనంగా సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది.

నేటి కార్యక్రమాలు

- గురువారం ప్రారంభం కానున్న వార్షికోత్సవాలు పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సారథ్యంలో జరగనున్నాయి. వేడుకలకు పీఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.
- లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ రాజశ్యామల యాగం నిర్వహిస్తారు.

జోనల్ కమిషనర్ల మార్పు



జోన్-1 జెడ్సీ కనకమహాలక్ష్మి



జోన్-2 జెడ్సీ శైలజావల్లీ



జోన్-4 జెడ్సీ ప్రసాదరావు



గాజువాక జెడ్సీ సన్యాసినాయుడు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని జోనల్ కమిషనర్లను మార్పు చేస్తూ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కనకమహాలక్ష్మిని జోన్-1 జోనల్ కమిషనర్‌గా, జోన్-1 జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శైలజావల్లీని జోన్-2 జోనల్ కమిషనర్‌గా మార్పు చేశారు. జోన్-4 జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సన్యాసినాయుడును గాజువాక జోనల్ కమిషనర్ మార్పు చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రసాదరావును జోన్-4 జోనల్ కమిషనర్‌గా మార్పు చేస్తూ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

'నేమాని' డిజిటల్ పంచాంగం ఆవిష్కరణ



'నేమాని' డిజిటల్ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న స్వామీజీ

పెందుర్తి: పంచాంగ ముద్రణలో ప్రసిద్ధిగాంచిన నేమాని కుటుంబం డిజిటల్ పంచాంగాన్ని రూపొందించింది. ఆయా పంచాంగాన్ని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాంగ ప్రచురకర్తలు నేమాని మురళీశంకరశాస్త్రి, నేమాని రమేష్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా పంచాంగాన్ని డిజిటలైజ్ చేసి పోర్టల్‌లో ఉంచామన్నారు. నేమాని ఆస్ట్రాలజీ పోర్టల్ ద్వారా ఆయా పంచాంగాలను అనుసరించవచ్చని..ఇది పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ సుజాత, శ్రీశైలం, సింహాచలం దేవస్థానాల ఈవోలు పెద్దిరాజు, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదండు.. రాజకీయ అరంగేట్రం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, మాతృభాషాభిమానులు

డాబాగార్డెన్స్: పదేళ్లుగా పరవస్తు పద్యపీఠం, తెలుగుదండు ఆధ్వర్యంలో తెలుగుభాష రక్షణకు ఉద్యమాలు నిర్వహిస్తూ పాలకులతో పోరాడుతున్న తెలుగుదండు ఈ దఫా ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటుందని తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, మాతృభాషాభిమానుల చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా మాతృభాష రక్షణకు ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మాతృభాషాభిమానుల విన్నపాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కును నిలబెడతామన్నారు. ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి 24 గంటల పాటు జీవీఎంసీ గాంధీ విగ్రహం వేదికగా దీక్షతో ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. విశాఖ ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఫణిశయనసూరి తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్త డీవీ సూర్యారావు, కామేశ్వర శర్మ, శంకర్ నీలు, చిన సూర్యనారాయణ, ఉద్యమ పెద్దలు రాజమన్నార్, గంగరాజు, భానుకుమార్, గిరిబాబు, కళాకారులు హేమ తదితరులు పాల్గొన్నారు.

గీతం హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


ఇస్మాయిల్ మృతదేహం

ఆరిలోవ : మనస్తాపంతో గీతం వర్సిటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరిలోవ ఎస్‌ఐ సీహెచ్.హరికృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా గోపవరం మండలం బద్వేలు గ్రామానికి చెందిన గోనుగుంట ఇస్మాయిల్(19) గీతం వర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం(సీఎస్ఈ) చదువుతున్నాడు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ హాస్టల్‌లో ఉంటున్నాడు. రూంలో ఇస్మాయిల్, మరో విద్యార్థి కలిసి కొన్నాళ్లు ఉండేవారు. ఇటీవలే ఆ విద్యార్థి వేరే రూంకు మారిపోయాడు. దీంతో కొద్ది రోజులుగా ఇస్మాయిల్ ఒక్కడే రూంలో ఉంటున్నాడు. మరోవైపు ఈయన సుమారు పదేళ్ల నుంచి థైరాయిడ్‌తో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి 10 గంటలకు రూంలో తలుపులు లోప గడియపెట్టి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ సిబ్బంది అదేరోజు రాత్రి 11 గంటలకు గదులు చెక్ చేస్తుండగా ఇస్మాయిల్ తలుపు తెరవలేదు. దీంతో సిబ్బంది రూం కిటికీలు నుంచి లోపలకు చూసేసరికి కిందపడి ఉన్న ఇస్మాయిల్, పక్కనే పురుగు మందు డబ్బా ఉండడాన్ని గమనించారు. వెంటనే తలుపులు బద్దలుకొట్టి ఇస్మాయిల్‌ను గీతం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే ఇస్మాయిల్ తల్లిదండ్రులకు సమాచాం అందించారు. మృతుడు తల్లిదండ్రులు బుధవారం ఉదయం గీతంకు చేరుకొన్నారు. తన కుమారుడు పదేళ్ల నుంచి థైరాయిడ్‌తో బాధపడుతున్నాడని, దాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఇస్మాయిల్ తల్లి హజరత్‌బీ ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇస్మాయిల్‌కు తల్లిదండ్రులు, అక్క ఫాతిమా ఉన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం.!

- నేడు డీసీసీబీ మహాజన సభ
- 2024–25 వార్షిక బడ్జెట్‌పై చర్చ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 బ్రాంచిల ద్వారా కార్యకలాపాలు
- మరో 13 కొత్త బ్రాంచిల ఏర్పాటుకు కసరత్తు


విశాఖ మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో రైతులకు తోడ్పాటు అందించేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పక్కా ప్రణాళికతో ముందుకెళ్లోంది. రైతుల శ్రేయస్సే ప్రధాన అజెండాతో గురువారం జరగనున్న మహాజన సభలో 2024–25 వార్షిక బడ్జెట్‌పై చర్చించనున్నారు. నగరంలోని మర్రిపాలెంలో ఉన్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బ్యాంక్ చైర్‌పర్సన్ కోలా గురువులు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు అంతా సిద్ధం చేశారు.

తక్కువ వడ్డీకే రుణాలు

- డిసెంబర్ మాసాంతం వరకు బ్యాంకులో అన్ని రకాల డిపాజిట్లు కలిపి రూ.883.94 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం, నాబార్డు నిర్దేశించిన వడ్డీ రేటుకు అనుగుణంగా ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేస్తున్నారు.
- 2023–24 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 20,005 మంది సభ్యులకు పంట రుణాల రూపేణా రూ.127.68 కోట్లు, అదే విధంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 7,694 మందికి రూ.53.72 లక్షలు ఇచ్చారు.
- వ్యవసాయ యాంత్రీకరణకు తోడ్పాటు అందించేలా కస్టమ్ హైరింగ్ కేంద్రాల(సీహెచ్‌సీ)కు ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 208 గ్రూపులకు రూ.4.56 కోట్లు మంజూరు చేశారు.
- స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసమని బ్యాంకు ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 724 గ్రూపులకు రూ.39.13 కోట్లు రుణాలు మంజూరు చేశారు.
- బ్యాంకు ద్వారా సేవలు పొందుతున్న సభ్యుల్లో 75,757 మంది రైతులకు కిసాన్ రూపే కార్డులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీలతో వ్యాపార విస్తరణ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 30 బ్రాంచీలు, వాటి పరిధిలోని 98 వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా కొత్త బ్రాంచీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. విశాఖ జిల్లాలో 2, అనకాపల్లిలో 9, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 బ్రాంచీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విశాఖ జిల్లాలోని పద్మనాభం, ఆనందపురంలో బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు నుంచి ఇప్పటికే అనుమతులు వచ్చాయి. వీటిని త్వరలోనే ప్రారంభించేలా బ్యాంకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

బ్యాంకుల కంప్యూటరీకరణ

డీసీసీబీ ఆధ్వర్యంలో అవసరమైన చోట్ల ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ సూచనలకు అనుగుణంగా కంప్యూటరీకరణ, సైబర్ సెక్యూరిటీ, భవిష్యత్ అవసరాల మేరకు డేటా స్టోరేజీలో భాగంగా అంతా డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో బ్రాంచికి రూ.3.91 లక్షల ఖర్చుతో డిజిటిలైజేషన్ పనులు చేపట్టారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు తోడ్పాటు అందిస్తూనే, బ్యాంకు అభివృద్ధి కోసమని వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టాం. రుణాల రికవరీ లక్ష్యం మేరకు సాగితేనే బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది. ఆ దిశగా అంతా సమన్వయంతో పని చేస్తున్నాం. దీనిపై మహాజన సభలో సభ్యులందరి ఆమోదంతో 2024–25 వార్షిక బడ్జెట్‌కు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగిస్తాం

– డి.వి.ఎస్.వర్మ, సీఈవో, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

అంతా నా ఇష్టం..అడ్డొస్తే రోడ్డునూ తవ్వేస్తా..!

- టీడీపీ నేత బరితెగింపు


అడ్డంగా తవ్వేసిన ప్రధాన రోడ్డు

కొమ్మాది : అంతా నా ఇష్టం..నా దారికి అడ్డొస్తే రహదారినే తవ్వేస్తా.. ప్రజలు ఇబ్బంది పడితే నాకేంటి.. అని ఓ టీడీపీ నేత బరితెగించాడు. తన వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వం వేసిన రోడ్డునే అడ్డంగా తవ్వేశాడు. ప్రజల రాకపోకలను నిలిపివేశాడు. జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని జీవీ అగ్రహారం నుంచి నిడిగట్టుకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డే ఉంది. ఈ మార్గంలో రోజూ చుట్టుపక్కల గ్రామాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం పక్కన ఓ తెలుగుదేశం పార్టీ నేతకు చెందిన పొలం ఉండడంతో వ్యక్తిగత అవసరాల కోసం రోడ్డు అడ్డంగా తవ్వేశాడు. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డును తవ్విన టీడీపీ నేతపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. దీనిపై జోనల్ కమిషనర్ శైలజవల్లీ స్పందిస్తూ ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

ఒత్తిడి లేని చదువులు అవసరం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఏపీఎస్సీపీఆర్‌సీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సొసైటీ, ఐసీడీఎస్, ఐసీపీఎస్‌ల సారథ్యంలో బుధవారం నగరంలోని శ్రీకృష్ణాపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థుల్లో మార్కులే లక్ష్యం కాకూడదన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు డాక్టర్ గంగాధర్, జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారితో అధిక సమయం వెచ్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.రూపవతి, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, చైల్డ్ డెవెలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, ప్రిన్సిపాల్ రత్నవల్లి పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

- మృతుడి సంచిలో రూ.40 వేలు నగదు లభ్యం
- బ్యాంకు ఖాతాలో మరో రూ.3 లక్షలు
- ఆచూకీ కోసం పోలీసుల ఆరా


గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

ఆరిలోవ: గుర్తు తెలియని ఓ యాచకుడు ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తోటగరువు, పెదగదిలి ప్రాంతంలో సుమారు 76 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు యాచన చేస్తూ కొద్ది రోజులుగా గడుపుతున్నాడు. ఈయన బుధవారం ఉదయం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ వృద్ధుడిని వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ కొద్ది సేపటికి మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఇదిలా ఉండగా ఆ వృద్ధుడి వద్ద చిన్న సంచిలో సుమారు రూ.40 వేలు నగదు, ఆంధ్రా బ్యాంక్ పాసు పుస్తకం ఉంది. ఆ అకౌంట్‌లో సుమారు రూ.3 లక్షల నగదు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ఖాతా బుక్‌పై జర్జన సూర్యనారాయణ, సంతపాలెం అని అడ్రస్ ఉంది. ఆ అడ్రస్ ప్రకారం చిన గదిలి ప్రాంతం సంతపాలెంలో పోలీసులు పరిశీలించారు. ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు

- కలెక్టర్, సీపీకి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి
- తక్షణ సహాయంగా రమణయ్య కుటుంబానికి రూ.2 లక్షల అందజేత


కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట: విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్‌ను కలిసి పలు అంశాలపై వినతి పత్రాలు సమర్పించారు. తహశీల్దార్ రమణయ్య కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద రూ.2 లక్షల చెక్కును వెంకటేశ్వర్లు అందజేశారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాపై హర్షం : రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వానికి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. భూఆక్రమణలు, దీర్ఘకాలిక భూతగదాల కేసుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా


మాట్లాడుతున్న కేఏ పాల్

తాటిచెట్లపాలెం : తాను విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్నానని, గెలిపిస్తే రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. బుధవారం రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎంపీగా పోటీచేస్తున్నానని తెలిసి టీడీపీ నేత భరత్ విశాఖలో పోటీచేయనని తెలిపారని, అలాగే బొత్స ఝాన్సీ, జీవీఎల్‌లు కూడా తప్పుకొని తనను గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. రానున్న ఎన్నికల్లో స్థానికులను మాత్రమే గెలిపించాలని కోరారు.

గ్రాండ్ లివింగ్ ఫర్నీచర్ మాల్ ప్రారంభం


మాల్‌ని ప్రారంభిస్తున్న సంస్థ చైర్మన్ జనాబ్ అబ్దుల్ కరీం

సీతమ్మధార : ఆశీలమెట్ట దరి ఎంవీఎస్ జ్యుయలరీ పార్కు భవనంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ లివింగ్ ప్రీమియర్ ఫర్నిచర్ మాల్‌ను బుధవారం సంస్థ చైర్మన్ జనాబ్ అబ్దుల్ కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ఫర్నీచర్ ఈ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జనాబ్ మహమ్మద్ మొయిన్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ విశాఖ నగరంలో ఇది రెండో షోరూమని చెప్పారు. గృహాలు, కార్యాలయాలకు అవసరమైన విభిన్న శైలి లేదర్ రిక్‌లైనర్ సోఫా, కార్నర్ సోఫాలు, టేకు, కలప మంచాలు, డైనింగ్ టేబుల్స్, కుర్చీలు, ఆఫీస్ ఫర్నీచర్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ధరలతో ఫర్నీచర్స్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖ–లీగల్: చెక్కు బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.18 లక్షల జరిమానా విధిస్తూ నగరంలోని ఏడో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.విశ్వనాథం బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు, న్యాయవాది డి.సత్తిబాబు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు సాగి శ్రీనివాసరావు సీతమ్మధారలో ఉంటున్నాడు. ఈయన లక్ష్మి నివాస్ హౌసింగ్ ప్రాజెక్టు భాగస్వామి. ఈ నేపథ్యంలో స్నేహితుల చొరవతో భాస్కరరావు దగ్గర శ్రీనివాసరావు 2022 జనవరి 7న రూ.30 లక్షలు అప్పుగా తీసుకున్నారు. నిందితుడు శ్రీనివాసరావు అప్పు తీర్చే నిమిత్తం రూ.18 లక్షలకు గతేడాది మార్చి 7న చెక్కు జారీ చేశారు. ఈ చెక్కుని ఫిర్యాదిదారుడు తన ఖాతాలో జమ చేయగా, తగినన్ని నిధులు లేని కారణంగా ఆ చెక్కు నిరాదరణకు గురైంది. నిందితుడు డబ్బులు ఇవ్వకపోవడంతో ఫిర్యాదుదారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు నిచ్చారు.

అయోధ్యకు 'ఆస్థా' పయనం


రైల్వేస్టేషన్‌లో ఎంపీ జీవీఎల్, అయోధ్య భక్తులు

తాటిచెట్లపాలెం : అయోధ్య బాల రాముని దర్శనం కోసం భారతీయ రైల్వే ఏర్పాటు చేసిన 'ఆస్థా' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నం నుంచి రామభక్తులతో బుధవారం రాత్రి బయల్దేరింది. ఈ సందర్భంగా భక్తులకు వీడ్కోలు పలుకుతూ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పలు సూచనలు చేశారు. మళ్లీ విశాఖకు వచ్చే వరకు ఆస్నీ ట్రస్ట్ సభ్యులు, ఐఆర్‌సీటీసీ సభ్యులు చూసుకుంటారని ఆయన తెలిపారు. రాష్ట్రం నుంచి అయోధ్యకు బయల్దేరుతున్న మూడో రైలు ఇది. విశాఖపట్నం నుంచి బయల్దేరిన మొదటి రైలు ఇదే. విశాఖపట్నం–అయోధ్య(08572) ఆస్థా స్పెషల్ బుధవారం రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి ఈ నెల 16వ తేదీ ఉదయం 10.35 గంటలకు అయోధ్య ధాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అయోధ్య–విశాఖపట్నం (08572) ఆస్థా స్పెషల్ 17వ తేదీ రాత్రి 7.55 గంటలకు అయోధ్య ధాంలో బయల్దేరి సోమవారం ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మొత్తం 20 స్లీపర్ క్లాస్ కోచ్‌లతో బయల్దేరింది. విశాఖపట్నం నుంచి మొత్తం 1100 మంది బయల్దేరగా, విజయనగరం నుంచి మరో 300 మంది ఈ రైలులో అయోధ్యకు వెళ్లనున్నారు. విశాఖపట్నం నుంచి ఈ నెల 19, 28వ తేదీల్లో మరో రెండు రైళ్లు బయల్దేరనున్నాయి.

రాష్ట్రానికి బీజేపీ తీవ్ర ద్రోహం

డాబాగార్డెన్స్: ప్రధాని మోదీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర ద్రోహం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. జగదాంబ జంక్షన్ సమీప సీపీఎం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. విశాఖ రైల్వే జోన్‌కు నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వలేదన్న అబద్దపు ప్రచారాలతో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలు తలపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఒక పక్క ప్రకటన చేస్తే.. మరో వైపు మోదీ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మి తీరుతామని ప్రకటనలు చేయడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనన్నారు. అటువంటి బీజేపీకి టీడీపీ, జనసేన పార్టీలు పోటీపడి సహకరించడం ఆందోళనకర విషయమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమించకుండా పరిశ్రమను అమ్మేస్తే తామే కొంటామని నారా లోకేష్ ప్రకటనలు చేయడం ప్రైవేటీకరణకు సహకరించడమేనన్నారు. ఈ నెల 16న దేశ వ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు.